ప్రజాశక్తి





శనివారం 5 నవంబరు 2022 8 పేజీలు ఎన్‌టిఆర్ కృష్ణా

కంచికచర్ల మండలం పరిటాల వద్ద చంద్రబాబుకు ఘన స్వాగతం పలుకుతున్న దృశ్యం; అంతర్‌చిత్రంలో రాయి దాడిలో గాయపడిన సెక్యూరిటీ సిబ్బంది మధు



నాటకాల సిఎంను సాగనంపాలి

రోడ్ షోలో చంద్రబాబు

ప్రజాశక్తి - కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట, భవానీపురం : నవరత్నాల పేరుతో నాటకాలాడుతున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని సాగనంపాలని మాజీ ముఖ్య మంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా నందిగామ, జగ్గయ్యపేటల్లో నియోజకవర్గాల్లో 'బాదుడే బాదుడు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన రోడ్డు షో నిర్వహించారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరిన ఆయనకు విజయవాడ, కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేటల్లో ఘన స్వాగతం లభించింది. నందిగామ రైతుపేట సెంటర్లో గజమాలతో కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులిచ్చారు. అలాగే కంచికచర్ల మండలం పరిటాల వద్ద మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య అధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అక్కడ చంద్రబాబు కారులోనుంచి బయటకు వచ్చి ప్రజలకు అభివాదం చేశారు. 'జై చంద్రబాబు... కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు' కార్యకర్తలు నినాదాలు చేస్తూ పూలవర్షం కురిపించారు. రెండు నిమిషాలపాటు రోడ్డుపై నిలిచిన చంద్రబాబు కాన్వాయ్ తర్వాత ముందుకు సాగింది. కంచికచర్ల మండలం పేరకలపాడు అడ్డరోడ్డు, కీసర గ్రామాల్లోనూ ఆయనకు స్వాగతం లభించింది. చంద్రబాబు వెంట మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఉన్నారు. నందిగామ గాంధీ సెంటర్లో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ జగన్ (మిగతా 6లో)

చంద్రబాబుపై దాడికి యత్నం వార్త మెయిన్‌లో

స్వపక్షంలో విపక్షం

- సమస్యలపై 'జడ్‌పి'లో గళమెత్తిన అధికారపక్ష సభ్యులు
- ఆరోగ్య శ్రీ సేవలు అందడంలేదని ఆగ్రహం
- జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలకు డిమాండ్
- 108 కో ఆర్డినేటర్‌పై చర్యలకు సూచన

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

"విజయవాడ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు అందడం లేదు. ఆరోగ్య శ్రీ ట్రస్టు నుంచి ఆమోదం రానిదే అత్యవసర వైద్య సేవలందడం లేదు. కౌంటర్లో ముందస్తు డిపాజిట్ చేస్తేనే గుండెపోటు వచ్చిన పేషెంట్లకు చికిత్స చేస్తామని నెట్‌వర్కు ఆస్పత్రుల వారు డబ్బులు వసూలు చేస్తున్నారు. స్పెషలిస్టులేని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సంబంధం లేని వైద్య సేవలందించి మోసం చేస్తున్నాయి" స్వయంగా అధికారపక్ష సభ్యులే గళమెత్తిన పరిస్థితి జిల్లా పరిషత్ సమావేశంలో చోటుచేసుకుంది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన శుక్రవారం మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అధికారపార్టీ ప్రజాప్రతినిధులే పలు సమస్యలు లేవనెత్తారు. అంతేకాదు... 108 స్పందన పేలవంగా ఉందని, పిహెచ్‌సిల మ్యాపింగ్ లోపభూయిష్టంగా ఉందని, అధికారులు చిత్తశుద్ధితో పనిచేయడంలేదని, సమస్యలు పరిష్కరించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పెనమలూరు, నూజివీడు ఎంఎల్ఎలు కొలుసు పార్థసారధి, మేకా వెంకట ప్రతాప అప్పారావు కోరారు. తోట్లవల్లూరు మండలంలో రెండో పిహెచ్‌సి నిర్మాణంలో ఎందుకు జాప్యం జరుగుతోందో చెప్పాలని పామర్రు ఎంఎల్ఎ కైలే అనిల్‌కుమార్ డిఎంహెచ్ఓ గీతాబాయిని ప్రశ్నించారు. త్వరలో నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తామని అధికారులు సమాధానమిచ్చారు. విలేజ్ క్లీనిక్‌లలో మందులు ఉండటం లేదని ఇబ్రహీంపట్నం జడ్‌పిటిసి సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. జగనన్న హౌసింగ్ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని అవనిగడ్డ, నూజివీడు ఎంఎల్ఎలు సింహాద్రి రమేష్, మేకా ప్రతాప్ అప్పారావు విజ్ఞప్తి చేశారు. గత ఏడాది మిల్లర్ల మాయాజాలంతో రైతులకు మద్దతు ధర అందలేదదని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఈసీజన్లో నిర్దేశించిన మొత్తంకన్నా తేమశాతం అధికంగా ఉన్న ధాన్యాన్ని సేకరించడానికి అవకాశాలను పరిశీలించాలని, రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని పెనమలూరు ఎంఎల్ఎ పార్థసారథి కోరారు. వ్యవసాయం, ఆరోగ్యం, ఆర్‌డబ్ల్యూఎస్, ధాన్యం సేకరణ, ఆర్అండ్‌బిశాఖల అంశాలపై సమావేశంలో చర్చించారు.

108 కో ఆర్డినేటర్‌పై చర్యలు తీసుకోండి : ఎంఎల్ఎ పేర్ని నాని

'రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని రక్షించడానికి 108కు ఫోన్‌చేస్తే వాహనం రావడానికి చాలా సమయం పట్టింది. ఇటువంటివి ప్రభుత్వ ప్రతిష్టకు మచ్చగా మారతాయి" అని జి.కొండూరు జడ్‌పిటిసి సభ్యులు లక్ష్మీతిరుపతమ్మ సమావేశంలో ప్రస్తావించారు. ఈ అంశంలో సంబంధిత లొకేషన్ నుంచి 108కు ఫోన్ ఏ సమయంలో వచ్చింది, పేషెంట్ వద్దకు ఎప్పటిలోగా వాహనం వెళ్లింది అన్న వివరణ ఇచ్చి జడ్‌పిటిసి సందేహాన్ని నివృత్తి చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా డిఎంహెచ్ఓ సుహాసినిని మచిలీపట్నం ఎంఎల్ఎ పేర్ని నాని కోరారు. ఈ సమావేశానికి 108 కో ఆర్డినేటర్ వస్తారని సమాచారం ఇచ్చారని, ఆయన వచ్చి వివరణ ఇస్తారని చెప్పారు. అయితే సమావేశ వేదికపైకి పిలిచినా కో ఆర్డినేటర్ అందుబాటులోకి రాలేదు. కో ఆర్డినేటర్‌పై చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ నాని సూచించారు.

సక్రమంగా ధాన్యం కొనుగోళ్లు జరగాలి

జడ్‌పి సమావేశంలో మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : ప్రజలకు జవాబుదారీతనంతో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన శుక్రవారం కృష్ణాజిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో జరిగింది. కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లు, ఈ రెండు జిల్లాలతోపాటు ఏలూరు జిల్లా పరిధిలో శాసనసభ్యులు, జడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు పాల్గొన్న ఈ సమావేశంలో వ్యవసాయం, వైద్య ఆరోగ్యం, గృహనిర్మాణం, ఆర్డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి రహదారుల అంశాలపై చర్చించారు. ఈసమావేశంలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు అధికారుల దష్టికి తెచ్చిన ప్రజా సమస్యలపై స్పందించాలని అధికారులను ఆదేశించారు. జడ్‌పి చైర్‌పర్సన్ హారిక అధ్యక్షోపన్యాసం చేస్తూ అభివృద్ధి వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందడానికి సమాన అవకాశాలు కలిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పూర్వపు కృష్ణాజిల్లాలో జడ్‌పి, ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు 4 శాతం జడ్‌పి కంటింజెన్సీ నిధుల నుండి సుమారు 30 వేల మందికి ఉచితంగా స్టడీ మెటీరియల్ సరఫరాకు సమావేశం తీర్మానించింది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవంనాడు జడ్‌పిటిసిలను హెచ్ఎంలు ఆహ్వానించేలా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ తీర్మానించింది. జడ్‌పి చైర్మన్‌ను జిల్లా స్థాయి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా, జడ్‌పిటిసిలను మండల స్థాయిలో ఆస్పత్రుల అభివృద్ధి కమిటీలో భాగస్వాములుగా చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. పెనమలూరు ఎంఎల్ఎ కె.పార్థ సారధి మాట్లాడుతూ ధాన్యం విక్రయించిన రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా చూడాలని కోరారు. గ్రామ సభలు నిర్వహించి ధాన్యం కొనుగోలు నిబంధనలు వివరించి విస్తతంగా అవగాహన కల్పిస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు సమాధానమిచ్చారు. డిసిసిబి చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ తేమశాతం ఆర్బీకేలు, మిల్లుల్లో వేర్వేరుగా లెక్కిస్తుండటం రైతులకు నష్టం కలిగిస్తోందన్నారు. జడ్‌పి వైఎస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి మాట్లాడుతూ (మిగతా 6లో)



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్, చిత్రంలో హారిక

దాళ్వా సాగుపై 'నీళ్లు'

రబీకి నీరివ్వలేమని తేల్చిన జిల్లా సాగునీటి సలహా మండలి

ప్రత్యామ్నాయ పంటలకు అవకాశం శూన్యం

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

రబీలో దాళ్వాసాగుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. వరుసగా రెండో ఏడాదీ దాళ్వాకు నీరివ్వలేమని జిల్లా సాగునీటి సలహామండలి స్పష్టం చేసింది. దీంతో వరి మినహా ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవకాశం లేని చౌడు భూముల్లో రెండో పంట వేసుకునే అవకాశం లేకుండా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కృష్ణాజిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్లో 4.35 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. నల్లరేగడి నేలలు అపరాల సాగుకు అనుకూలం. ఈ భూముల్లో అత్యధిక విస్తీర్ణంలో రబీలో రెండో పంటగా వరి కోతల సమయంలో అపరాలు వెదజల్లుతారు. కొన్ని ప్రాంతాల్లో బోర్ల కింద మొక్కజొన్న, జొన్న సాగుచేస్తున్నారు. మచిలీపట్నం, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, కృత్తివెన్ను తదితర సముద్ర తీర మండలాల్లోని 60 వేల ఎకరాల్లో క్షారభూములున్నాయి. ఈ భూముల్లో రెండో పంటగా దాళ్వా సాగు మినహా మరో ప్రత్యామ్నాయం పంటలు వేసే పరిస్థితిలేదు. ప్రభుత్వం సాగునీరు విడుదల చేయలేమని చెప్పడంతో ఈ భూముల రైతులు ఒక పంటసాగుతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండు పంటలు పండించిన రైతులకే అరకొరగా వచ్చే ఆదాయాలు... పెరిగిన ధరలతో కుటుంబాలు నెట్టుకు రావడం కష్టంగా మారింది. ఒకపంటతో కుటుంబాలను ఎలా నెట్టుకురావాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు.

దాళ్వా లేదు సరే... ఇతర పంటలకు ప్రణాళికేదీ ?

రెండో పంటగా అపరాలతోపాటు మొక్కజొన్న, జొన్న తదితర పంటల సాగుకు నల్లరేగడి భూములు అనుకూలం. అపరాలకు తేలికతడులు, మొక్కజొన్న, జొన్న పంటల సాగుకు ఆరుతడులు నీరు అవసరం ఉంటుంది. ఈ పంటలకు నీటి విడుదలపై స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులంతా అపరాలు వేయక తప్పడంలేదు.

కృష్ణమ్మ పరవళ్లు

పులిచింతలలో నీటిని నిల్వ చేయకముందే కృష్ణాడెల్టాకు సాగునీరు ఇచ్చిన సందర్భాలు న్నాయి. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులు నిండుకుండల్లా ఉన్నాయి. అక్టోబర్, నవంబర్లలోనూ కృష్ణానదికి వరద నీరు పోటెత్తింది. ప్రకాశం బ్యారేజీ నుంచి కాల్వలకు విడుదల చేయగా 1400 క్యూసెక్కుల నీటిని శుక్రవారం సముద్రంలోకి విడుదల చేశారు. ప్రాజెక్టుల్లో దాళ్వాసాగుకు అవసరమైన నీరులేదని జిల్లా యంత్రాంగం ప్రకటించడం రైతులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

మెట్ట పంటలకు నష్టపరిహారం అందేనా..?

ప్రజాశక్తి-నందిగామ: ఇటీవల కురిసిన వర్షాలకు మెట్ట పంటలకు భారీ నష్టం జరిగింది. జిల్లాలో పత్తి,మిర్చి దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండానే ప్రభుత్వానికి నివేదికలు పంపటంతో కనీసం నష్ట పరిహారం వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ స్థాయి అధికారులు కూడా పంటలను పరిశీలించకపోవటంపై రైతులు అసంపూర్తిగా ఉన్నారు. జిల్లాలో ఈ ఏడాది 1.10 లక్షల యకరాలలో పత్తి సాగు చేశారు. ఎక్కువగా మిరప సాగు వేశారు. మే, జూన్ మొదటి వారాలలో పత్తి విత్తనాలు వేశారు. పత్తి చేతికి వస్తున్న తరుణంలో చెడు వర్షాలు వల్ల పత్తి పంట పూర్తిగా నష్టపోవటం జరిగింది. యకరానికి నాలుగైదు క్వింటాళ్ల వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దసరా నాటికే ఒకసారి పత్తి తీసి మార్కెట్ కు తరలిస్తారు. దీపావళికి రెండోతీత తీస్తారు. పత్తి ధర ఆశాజనకంగా ఉన్నా కాలం కలిసిరాకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దుక్కుల నుండి పైపాటు సస్యరక్షణ


తెగుళ్లు సోకిన పత్తి

మందుల వరకు ఇప్పటి వరకు 45 వేల రూపాయల వరకు పెట్టుబడి అయింది .కౌలు రైతులకు అదనంగా మరో పది వేలు ఖర్చు అవుతుంది. పత్తి తీత సమయంలో భారీ వర్షాలు,వరదలు రావటంతో పత్తి రైతులు తీవ్రంగా నష్టం పోవటం జరిగింది. జిల్లా లో నందిగామ,తిరువూరు, జగ్గయ్యపేట నియోజకవర్గాలలో పత్తి, మిర్చి పంటలకు నష్టం భారీ జరిగింది. చందర్లపాడు మండల పరిధిలో కష్ణానది పరివాహక ప్రాంతాలలో మున్నేరు, వైరా, కట్టలేరు తదితర వాగుల సమీపంలో సుమారు 60 వేల ఎకరాలలో పత్తి పంట మునిగింది. పంటలు మునగడం వల్ల రైతులకు లక్షలలో నష్టం వచ్చింది. కాయ, పూత రాలిపోయింది. తీతలకు వచ్చిన పత్తి నల్లబడింది. మిరప నారు కుళ్లిపోయింది. మిర్చి నారు మళ్లీ కొనుగోలు చేసి నాటాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మెట్ట రైతులను ఆదుకోవాలి : కౌలురైతు సంఘం

ఇటీవల కురిసిన వర్షాలకు వరద ముంపునకు గురైన పత్తి, మిర్చి రైతులకు నష్టపరిహారం అందజేసి ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం ఎన్టిఆర్ జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు డిమాండ్ చేశారు. జిల్లాలో 50 వేల ఎకరాలలో పత్తి, 20 వేల ఎకరాలలో మిర్చి నారు దెబ్బతింది. పత్తి తెగులు సోకి పాడైపోతుంది. పంటలు మునిగినా వ్యవసాయ అధికారులు పరిశీలించలేదు. క్షేత్రస్థాయిలో అధికారులు పని చేయకుండా మొక్కుబడిగా నివేదికలు పంపుతున్నారు. ఎకరానికి రూ.30 వేలు చొప్పున పరిహారం అందజేయాలి.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-భవానీపురం: విజయవాడ, గుంటూరు పేకర్స్ అండ్ మూవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. 43వ డివిజన్ భవానీపురంలోని హౌసింగ్ బోర్డు హెచ్ఐజి 410 కాలనీలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్, కంటి పరీక్షలు చేసి కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. ఈ మెగా మెడికల్ శిబిరాన్ని 43వ డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, పేకర్స్ అండ్ మూవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పివికె ప్రసాద్ ప్రారంభించారు. ఏపిఎస్ఎసిఎస్ కెడిఎల్ఓఎ ప్రాజెక్ట్ మేనేజర్ వి.వి. సాంబశివరావు పర్యవేక్షణలో షష్ఠగిరి కంటి హాస్పిటల్ వారి సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ వైద్య శిబిరంలో జనరల్ పరీక్షలు నిర్వహించారు. సుమారు 200 మందికి మందులు, కళ్ళజోళ్లు, కంటి చుక్కల మందు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి సతీష్, సభ్యులు శివశంకర్, గోపి, కరుణాకర్, కోటేశ్వరరావు, డివిజన్ పెద్దలు టి. ప్రకాశరావు, వై. బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చందర్లపాడు: మండలంలోని పున్నవల్లి గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు కూరాకుల గోపి కుటుంబానికి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు ప్రభుత్వం



మంజూరు చేసిన రూ.7 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలు రోడ్డున పడకుండా సిఎం వారి కుటుంబాలకు అండగా ఉండాలని రూ.7 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోట మోహనరావు, జడ్పిటిసి ముక్కపాటి నరసింహారావు, మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, యార్లగడ్డ సత్యనారాయణప్రసాద్ పాల్గొన్నారు.

టిడిపి బ్యానర్ ధ్వంసం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: టిడిపి రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బొల్లా రామకృష్ణ ఫ్లెక్సీలను పట్టణంలోని చిల్లకల్లు రోడ్డులో



గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శుక్రవారం టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు జగ్గయ్యపేట నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో స్వాగతం పలుకుతూ రామకృష్ణ అభిమానులు, సానుభూతిపరులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపి వేయడంపై టిడిపి నేతలు మండిపడుతున్నారు. రామకృష్ణ ఎదుగుదలను ఓర్వలేక కొందరు హింసను ప్రేరేపించే ఈ చర్యకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలను తీసేసినంత సాధారణంగా ప్రజల మనసులో నుండి తనను తీయలేరని రామకృష్ణ వెల్లడించారు. ఫ్లెక్సీలను చించడంపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలను తీర్చడంపై పెట్టాలన్నారు.

ఆర్‌టిసి ప్రయాణికులకు బహుమతులు

ప్రజాశక్తి-తిరువూరు: సురక్షిత ప్రయాణానికి ఏపీఎస్ ఆర్టీసీ ఒకటే మార్గమని తిరువూరు డిపో మేనేజర్ వేణు అన్నారు. తిరువూరు మధిర రూట్ బస్సులలో జర్నీ చేసిన ప్రయాణికుల టికెటలను శుక్రవారం బస్టాండ్‌లో ఆయన సిబ్బంది, ప్రయాణికులతో కలిసి డ్రా తీశారు. తిరువూరు నుండి మధిర రూట్‌లో బహుమతి కె.వినయ్‌కుమార్, తిరువూరు నుండి విజయవాడ రూట్‌లో బి.రామారావుకి డ్రా ద్వారా బహుమతులు వచ్చినట్లుగా డిఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిఐ ఆశా జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానంలో నిలవాలి : ఎసిజి



ప్రజాశక్తి-విజయవాడ: రాబోయే ఏడాదిలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానం సాధించడానికి ఇప్పటి నుంచే ప్రణాళికా బద్ధమైన పని విధానం ఉండాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల అన్నారు. నగరంలోని మూడు సర్కిల్స్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్-23 టార్గెట్ లక్ష్యంగా అమలు చేయాల్సిన కర్తవ్యాలు, దాని అమలులో ప్రజారోగ్య విభాగం చేయాల్సిన కర్తవ్యాలపై క్షేత్రస్థాయి శానిటరీ ఇనిస్పెక్టర్లతో శుక్రవారం నగరపాలక సంస్థ అధికారులు చర్చించారు. సర్కిల్-1లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అదనపు కమిషనర్ (జనరల్) ఎం శ్యామల మాట్లాడుతూ...స్వచ్ఛ సర్వేక్షణ్-23లో విజయవాడ నగరం ప్రథమ స్థానం వచ్చేందుకు ఇప్పటి నుంచే ప్రజారోగ్య విభాగం అధికారులు, శానిటరీ ఇనిస్పెక్టర్లు, శానిటరీ వర్కర్లు అందరూ సమన్వయంతో శానిటేషన్ మెరుగుదలకు పనులు చేయాలన్నారు. రెడ్యూస్, రీ-యూజ్, రీ-సైకిల్ అమలు చేయుట, హెూమ్ కంపోస్టింగ్ చూడాల్సి ఉందన్నారు. యూజర్ ఫీ కలెక్షన్ వారానికి డివిజన్‌కు రూ. 8 లక్షలు టార్గెట్ విధించి, దానిని సాధించడానికి శానిటరీ సెక్రటరీలు, శానిటరీ ఇనిస్పెక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు నిరంతరం కృషి చేయాలన్నారు. వీటిని ప్రజారోగ్య విభాగం అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్లాస్టిక్ నిషేదాన్ని నగరంలో సక్రమంగా అమలయ్యే విధంగా అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశములో జోనల్ కమిషనర్ -1 కె.టి. సుధాకర్, ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ డా. ఏ.రవిచంద్, హెల్త్ ఆఫీసర్లు డా.సురేష్ బాబు, డా.శ్రీదేవి, డా.ఇక్బాల్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఐడిబిఐ డిపాజిట్ మహోత్సవం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ఐడీబీఐ బ్యాంక్ డిపాజిట్ మహోత్సవాన్ని ప్రారంభించినట్లు బ్యాంకు ప్రతినిధి రాజేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐడీబీఐ 700 రోజుల అమృత్ మహోత్సవ్ డిపాజిట్‌పై 7.50 శాతం వడ్డీరేటు అందిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు అమృత్ మహోత్సవ్ డిపాజిట్‌లలో కొత్తగా మరో వేరియంట్‌ను పరిచయం చేసినట్లు పేర్కొన్నారు. కేవలం 700 రోజులకు గరిష్టంగా 7.50 శాతం వడ్డీ రేటు అందించనున్నట్లు తెలిపారు. దీనితో పాటు 555 రోజుల అమృత్ మహోత్సవ్ డిపాజిట్లపై వడ్డీరేటును 6.50 శాతం నుండి 7 శాతానికి పెంచినట్లు తెలిపారు.

టౌన్‌ప్లానింగ్‌లో ఓపెన్ ఫోరం

ప్రజాశక్తి-విజయవాడ: నగరపాలకసంస్థ పట్టణ ప్రణాళికా విభాగంలో ఫ్రైడే ఓపెన్ ఫోరమ్ మూడు సర్కిల్స్ కార్యాలయాల్లోని అసిస్టెంట్ సిటీ ప్లానర్



కార్యాలయాల్లో శుక్రవారం జరిగింది. బిల్డింగు అనుమతులు, పెండింగ్ దరఖాస్తులపై అసిస్టెంట్ సిటీ ప్లానర్లు ఆయా ప్రాంతాల నుంచి విచ్చేసిన దరఖాస్తుదారులకు నివృత్తి చేశారు. ఓపెన్ ఫోరంలో సుమారు 12 మంది ప్రజలు పాల్గొని పట్టాణ ప్రణాళిక శాఖకు సంబంధించి తమ సమస్యలను తెలియచేసి తమ అనుమానములను నివత్తి చేసుకున్నారు. మూడు సర్కిల్స్ లో నిర్వహించిన మేళాలో పలు దరఖాస్తులను పరిశీలించి, వాటి పరిష్కారానికి ఎసిపిలు చర్యలు తీసుకున్నారు.

కెటిఎం బెస్ట్ స్పోర్ట్స్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: స్పోర్ట్స్ వాహనాల తయారీలో అగ్రగామిగా ఉన్న కెటిఎం ద్విచక్ర వాహనాల కంపెనీ నగరంలోని వెటర్నరీ కాలనీలో నూతన షోరూమ్‌ను ప్రారంభించింది. శుక్రవారం సాయంత్రం షోరూమ్‌ను ఎసిపి కె.దామోదరరావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన



మాట్లాడుతూ విజయవాడ నగరంలో కెటిఎం స్పోర్ట్స బైక్ షోరూమ్ ప్రారంభించడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా యువత ఎక్కువ మంది కెటిఎం వాహనాల పట్ల ఆసక్తి చూపుతున్నారన్నారు. అయితే యువత ఎక్కువగా వేగం వెళ్లకుండా నిబంధనలు ప్రకారం నడచుకోవాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను తప్పనిసరిగా వాడాలన్నారు. వరుణ్ మోటార్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ వినియోగదారుల సౌలభ్యం కోసం పెద్ద షోరూమ్‌ను విజయవాడ నగరంలో కెటిఎం ప్రారంభించినట్లు తెలిపారు. యువతకు నచ్చుతున్న బెస్ట్ స్పోర్ట్స్ వాహనంగా ఉన్న కెటిఎం ప్రొడక్ట్సను వరుణ్ మోటార్స్ ద్వారా మార్కెటింగ్ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కెటిఎం ఏరియా సేల్స్ మేనేజర్ పి.కార్తిక్, కెటిఎం, బజాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు మునకుళ్ల రోడ్డులో పోతుల చెరువు వద్ద గురువారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న తంగెళ్లడు కాలనీకి చెందిన మరకాల వెంకటేశ్వరరావు (50)ను మునకుళ్ల వైపు వెళ్తున్న మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఈ కేసులో అవతలి బైక్ నడుపుతున్న వ్యక్తి ఎర్రమాడుకు చెందిన వాడిగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని పూర్తి వివరాలు ఎస్ఐను అడగ్గా తెలిపేందుకు నిరాకరించారు.

50వ డివిజన్‌లో వెలంపల్లి పర్యటన

ప్రజాశక్తి-వన్‌టౌన్: పవన్ కళ్యాణ్‌పై రిక్కీ నిర్వహించాలనే ఆలోచన తమకు ఎందుకు వుంటుందని, పవన్ కళ్యాణ్ రాజకీయాలలో ఒక జోకర్ అని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. స్థానిక 50వ డివిజన్‌లోని 176వ సచివాలయం పరిధిలో 129వ రోజు శుక్రవారం నాడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని ఆయా ప్రాంతాలలో పర్యటించి గడప గడపకు వెళ్లి ప్రజలకు ఈ మూడేళ్ల కాలంలో ప్రభుత్వ పరంగా జరిగిన సంక్షేమ పథకాల వివరాలు తెలియచేస్తూ సమస్యలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ పార్టీ నాయకులూ, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో గడప గడపకు విజయవంతంగా చేస్తున్నామన్నారు. జనసేన డివిజన్ అధ్యక్షుడు పోతిన వెంకట మహేష్ ఇంట్లో కూడా అన్ని సంక్షేమ పథకాలు ఇచ్చామన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు ఇస్తున్న ఘనత జగన్ మోహన్ రెడ్డిదన్నారు. చంద్రబాబుకి ఎవరితో ఒక్కరితో పని చేయించాలి అనే కుతూహలంతో పవన్ కళ్యాణ్‌పై రిక్కి అని డ్రామాలు ఆడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 50వ డివిజన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బంక విజయ, బంక శివ మిత్ర బృందం పాల్గొన్నారు.



ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
శనివారం 5 నవంబర్ 2022

ఆరుతడి పంటలకు రైతులు సిద్ధం కావాలి : జోగి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

రిజర్వాయర్లలో నీటి లభ్యత సరిపోయినంత లేనందున రబీ (దాళ్వా)కు సాగునీరు ఇవ్వడం సాధ్యపడటం లేదని, రైతులు దీనిని దృష్టిలో



మాట్లాడుతున్న రాష్ట్ర గృహ నిర్మాణశాఖామంత్రి జోగి రమేష్

పెట్టుకొని ఆరుతడి పంటలకు సిద్ధం కావాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. కలెక్టరేట్లోని స్పందన సమావేశపు మందిరంలో శుక్రవారం కృష్ణాజిల్లా 37వ నీటి పారుదల సలహా మండలి సమావేశం జరిగింది .ఈ సమావేశంలో 2022 సంవత్సరపు ఖరీఫ్ (సార్వా) నీటి వినియోగం, 2022-23 సంవత్సరానికి రబీ(దాళ్వా) సాగు కార్యాచరణ ప్రణాళికపై మంత్రి, జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, అవనిగడ్డ నియోజకవర్గ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, ఏపి వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవిఎస్.నాగి రెడ్డిలతో కలసి జలవనరులు, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సంవత్సరం ఇప్పటి వరకు జిల్లాలో 10.35 లక్షల -ఎకరాల వరి 0.23 లక్షల ఎకరాల చెరకు, 1.81 లక్షల ఎకరాల ఆక్వా సాగుకు మొత్తం 118.70 టీఎంసీల నీరు సాగు, తాగునీరు నిమిత్తం ఉపయోగించుకున్నామన్నారు. ప్రస్తుతం పులిచింతల ప్రాజెక్టులో 41.15 -టీఎంసీల నీరు మాత్రమే లభ్యంలో ఉందని, అందులో 36.20 టీఎంలు ప్రస్తుత ఖరీఫ్‌కు ఇంకా ఇవ్వాల్సి ఉందన్నారు. మిగిలిన నీటి లభ్యత వచ్చే రబీకి ఏవిధంగాను సరిపోదని మంత్రి తెలిపారు. రబీ పంటకు కనీసంగా 51 టీఎంసీల నీరు అవసరం ఉంటుందన్నారు. దీనిని దష్టిలో పెట్టుకొని జిల్లా రైతులు ఆరుతడి పంటలకు సిద్ధం కావాలని మంత్రి కోరారు. శివారు భూములకు సైతం నీటి సమస్య లేకుండా చేయాలనే ఉద్దేశ్యంతో ప్రకాశం బ్యారేజ్ దిగువన రెండు కొత్త బ్యారేజ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదం తెలిపిందన్నారు. మొదటి బ్యారేజ్ అంచనా విలువ రూ.2235.42, రెండవ బ్యారేజ్ అంచనా విలువ రూ.2526.39 కోట్లతో పరిపాలనా అనుమతి కోసం ప్రభుత్వానికి సమర్పించామన్నారు. జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా మాట్లాడుతూ రబీ పంటకు సాగునీరు లేనందున కాల్వ మరమ్మతులు, పూడికతీత, గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు ముందుగానే చేపట్టాలని జలవనరులు, వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. గతంలో మాదిరిగా కాకుండా ముందుగానే పనులు మొదలు పెట్టి పంట సమయానికి పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్, నీటిపారదల చీఫ్ ఇంజనీర్ .ఎస్.తిరుమలరావు, పులిచింతల ప్రాజెక్ట్ ఎస్ఈ ఆర్ శ్రీరామకష్ణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మనోహరరావు, బందరు ఆర్డీఓ ఐ. కిషోర్, సిపిఓ వై. శ్రీలత, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బర్లంకలో రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-మోపిదేవి

మండల పరిధిలోని బొబ్బర్లంక గ్రామంలో శుక్రవారం రైతులకు ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం స్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి మాట్లాడుతూ పసుపు, కంద పంటల్లో వచ్చే



మాట్లాడుతున్న డాక్టర్ రేవతి

తెగుళ్ల ,పురుగులు ,ఉధతి వాటి సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు వివరించారు. పసుపు పంటలో దుంప గుళ్ళ నివారణకు ట్రైకోడెర్మా వీరిడి మందును పశువుల ఎరువు, వేప పిండిలతో కలిపి వృద్ధి చేసుకొని జీవ నియంత్రణ యాజమాన్య పద్ధతి ద్వారా నివారించుకోవచ్చని తెలిపారు. కూరగాయలు, పండ్ల తోటల్లో వివిధ రకాల అచ్ఛేధన పద్ధతుల ద్వారా భూమిలోని తేమశాతాన్ని కాపాడుతూ కలుపు నివారణ చేయటం ద్వారా నాణ్యమైన అధిక పంట దిగుబడులను సాధించే విధానంపై కృషి విజ్ఞాన కేంద్రం ఉధ్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి తెలిపారు. అనంతరం గ్రామంలోని అరటి పంటను క్షేత్ర ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థినిలు, గ్రామంలోని రైతులు గద్దె శ్రీహరి,బాల రామకష్ణ, కోనేరు శివ లీల, దప్పలపూడి జగన్మోహన్రావు, బి.కృష్ణయ్య, రైతులు పాల్గొన్నారు.

గురువుస్థానం ఎప్పుడూ పదిలమే..

ప్రజాశక్తి-పెడన

తమకు చదువు చెప్పిన లెక్చరర్‌ను గుర్తించి కృష్ణాజిల్లా పరిషత్ సమావేశ కార్యాలయంలో



గురువును సత్కరిస్తున్న ఉప్పాల హారిక దంపతులు

సత్కరించిన కష్ణా జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక రాము . తమ విద్యార్థుల అభివృద్ధిని చూసి ఉప్పొంగి పోయిన పెడన శ్రీ బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల కామర్స్ అధ్యాపకులు వి నిరంజనరావు. మాస్టారు యోగక్షేమాలు అడిగి తెలుసుకుని కతజ్ఞతలు తెలియజేశారు. తమ విద్యార్థుల అభివృద్ధిని చూసి సంతోషం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఉప్పాల హారిక దంపతులు చేరుకోవాలని ఆకాంక్షను వి.నిరంజనరావు వ్యక్తంచేశారు.

దాళ్వా సాగుకు అనుమతివ్వాలి : రైతుసంఘం

ప్రజాశక్తి-బంటుమిల్లి

బంటుమిల్లి మెయిన్ కాలువ పరిధిలో దాళ్వా పంటలో వరి సాగుకు అనుమతలిచ్చి రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బంటుమిల్లిలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బంటుమిల్లి ప్రాంతం సముద్ర తీర ప్రాంతంలో ఉండటంతో గతంలో కూడా రైతులు అనుమతి లేనప్పుడు అపరాలు సాగుచేశారన్నారు. దాదాపు అధిక శాతం రైతులకు ఖర్చులు కూడా రాలేదన్నారు. తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎందుకంటే ఈ ప్రాంతంలో అధిక శాతం అపరాలు పండటానికి అవకాశం లేదన్నారు. అందువల్ల రైతులు అపరాలు వేయటానికి సాహసించలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం రైతుల పరిస్థితులను అర్థం చేసుకొని, దాల్వా పంటకు వరి సాగుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం బంటుమిల్లి మండల కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, నాయకులు సుజ్ఞానం జనార్ధనరావు, సమ్మెట నాంచారయ్య, వీరంకి కోటేశ్వరరావు, కృత్తివెన్ను మండలం రైతు సంఘం అధ్యక్షులు పట్టపు ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి : రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి-పమిడిముక్కల

రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా వైఎస్సార్-జగనన్నకాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని పమిడిముక్కల తహశీల్దార్ రాజ్యలక్ష్మి కోరారు. పమిడిముక్కల మండలంలోని ఐనపూరులో జగనన్న



లే అవుట్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్ రాజ్యలక్ష్మి

ఇళ్ల నిర్మాణ లే అవుట్లను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని కోరారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్రప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో యేనుగు వెంకటేశ్వరరావు, సుభాష్ చంద్రబోస్, కొడమంచిలి మహేష్, గ్రామ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు కాన్వాయ్‌పై రాళ్ల దాడికి టిడిపి ఖండన

ప్రజాశక్తి-అవనిగడ్డ

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కాన్వాయ్ పై నందిగామలో జరిగిన రాళ్ల దాడిని ఖండిస్తూ అవనిగడ్డ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. శుక్రవారం సాయంత్రం రాజీవ్ సెంటర్లో పార్టీ శ్రేణులు కొవ్వొత్తులు పట్టుకొని నిరసన తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం పర్యటనలో ఉన్న చంద్రబాబు నాయుడుపై కొందరు దుండగులు రాళ్ల దాడి చేయడం అందులో చంద్రబాబు నాయుడు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మధుకు గాయాలయ్యాయన్నారు. వీటిని చూస్తుంటే రాష్ట్రంలో అరాచకపు పాలన పరాకాష్టకు చేరుకుందని పేర్కొన్నారు. పోలీస్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిపోగా ఆ స్థానంలో రౌడీ మూకలు రాజ్యమేలుతున్నాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, షేక్ బాబావాలి, పుల్లగోరు రాజేంద్రరావు, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, లుక్కా శ్రీనివాసరావు, అడపా శ్రీనివాసరావు, మాచవరపు ఆదినారాయణ, బర్మా శ్రీనివాసరావు, గుంటూరు వినయ్, కోట సాయి, దాసినేని శ్రీనివాసరావు, పర్మిశెట్టి సాంబయ్య, యాసం శ్రీరాములు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా అజ్మతుల్లా

ప్రజాశక్తి-ఉయ్యూరు

తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా సయ్యద్ అజ్మతుల్లా(బాబు) నియమితులయ్యారు. ఎంతో కాలంగా పార్టీకి విస్తృత సేవలందిస్తున్న అజ్మతుల్లా సేవలకు గుర్తింపుగా మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కింజారపు అచ్చె న్నాయుడు నియామక పత్రం అందజేశారు. తనపై నమ్మకంతో రాష్ట్ర



నియామక పత్రాన్ని అందజేస్తున్న అచ్చెన్నాయుడు

కార్యదర్శి పదవి ఇచ్చిన పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యదర్శి లోకేశ్, మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ముస్తాక్ అహ్మద్ తోపాటు తనపేరు ప్రదిపాదించి పదవి వచ్చేందుకు కృషిచేసిన పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, నాయకుడు కొనకళ్ల నారాయణరావు, బోడె ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అజ్మతుల్లా పేర్కొన్నారు.

మంచి ఉద్యోగంతోనే జీవితంలో ఉన్నత స్థానం : సింహాద్రి

ప్రజాశక్తి-అవనిగడ్డ

జాబ్ మేళాల్లో పాల్గొనడం ద్వారా ఉపాధి అవకాశాలు పొందడంతో పాటు ఉన్నతస్థాయికి ఎదగొచ్చునని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు సూచించారు శుక్రవారం అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాబ్ మేళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కుబేరులుగా, పారిశ్రామికవేత్తలుగా పేరు గడించిన వారంతా చిన్న ఉద్యోగాలు చేసిన వారేనన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. తీర ప్రాంతంలోని అవనిగడ్డలో ఇలాంటి జాబ్ మేళాలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల యువతకు మరిన్ని ఉద్యోగాల్లో స్థిరపడే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ జాబ్ మేళాలో 13 కంపెనీలు పాల్గొనగా మొత్తం 338 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 143 మంది ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు 24 మంది తదుపరి ఇంటర్వ్యూలకు ఎంపికైనట్లు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. అరబిందో ఫార్మా, కియో మోటార్స్, ఈన్నోప్ సోర్స్, అపోలో ఫార్మశీ, వరుణ్ మోటార్స్, మోహన్ స్పిన్‌టెక్స్, నవత ట్రాన్స్ పోర్ట్, అమర్ రాజా బ్యాటరీస్, శ్రీనివాస ట్రాక్టర్స్, ఏటీఎం ఏ వన్ మార్క్, అపెక్స్ వంటి కంపెనీలు హాజరైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతి దేవీ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి, గ్రామ సర్పంచ్ గోరుముచ్చు ఉమా, స్కిల్ డెవలప్‌మెంట్ అదనపు ఎగ్జిక్యూటివ్ డివి సందీప్, జిల్లా ప్లేస్మెంట్ ఎగ్జిక్యూటివ్ తుర్లపాటి మధు, ఈడి ఎగ్జిక్యూటివ్ బి.సుజిత్, జి.పృధ్విజ, కె.దిలీప్, ఆర్.ప్రశాంత్ కుమార్, పలువురు కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సింహాద్రి రమేష్‌బాబు

రాంబాబుకు మాతృ వియోగం

ప్రజాశక్తి-పమిడిముక్కల

పమిడిముక్కల మండలం హనుమంతపురం గ్రామ సర్పంచ్ కలపాల రాంబాబు తల్లి కలపాల రావమ్మ



(85) శుక్రవారం మృతిచెందారు. ఆమె భౌతికకాయాన్ని పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ సోదరుడు కైలే జగదీష్ సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఇంకా నివాళు లర్పించిన వారిలో కొడమంచిలి మహేష్, పాతూరు చంద్రపాల్, శొంఠి వెంకటేశ్వరావు, మారుపాక మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి : సిఐటియు



మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి డేవిడ్

ప్రజాశక్తి-వన్‌టౌన్: విజయవాడ నగరపాలక సంస్థలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర ప్రధాన కార్యదర్శి ఎం.డేవిడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సర్కిల్-1 కమిటీ మూడో మహాసభ మోటూరు హనుమంతురావు శ్రామిక భవన్‌లో గురువారం రాత్రి జరిగింది. డేవిడ్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ఆదివారం పూర్తి సెలవు అమలు చేయాలన్నారు. ఇంజనీరింగ్, వాటర్ సప్లై పార్క్‌లో పనిచేస్తున్న కార్మికులకు హెల్త్ అలవెన్స్ అమలు చేయాలని కోరారు. క్లాప్ ఆటోడ్రైవర్‌కు జీవో ప్రకారం వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయాలని, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన, రిటైర్ అయిన కార్మికుల కుటుంబాల పిల్లలకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ నగర అధ్యక్షులు ఎస్.జ్యోతిబస్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు పనిభారం పెరిగిందన్నారు. పనికి తగ్గ వేతనాలు అమలు చేయాలని కోరారు. సిఐటియు పశ్చిమ సిటీ అధ్యక్షులు ఇ.వి.నారాయణ మాట్లాడుతూ నేటి పాలకులు కార్మిక చట్టాలను తుంగలో తొక్కి, కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. సిఐటియు పశ్చిమ సిటీ కార్యదర్శి బోయి సత్యబాబు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యాలను కూడా లెక్కచేయకుండా అనుదినం పనులు చేస్తున్నారని, వారికి ఆదివారం పూర్తి సెలవు ఇచ్చేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా యు.ఏడుకొండలు, కార్యదర్శి వి.సాంబశివరావు, కోశాధికారిగా బి.రాము, ఉపాధ్యక్షులు ఎస్.లక్ష్మి. డి.శ్రీనివాస్, సహాయ కార్యదర్శి సిహెచ్.జగదీష్, వి.అప్పల నరసమ్మతో కూడిన 16 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.



దళిత, గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-వత్సవాయి: వత్సవాయి మండల కెవిపిఎస్ మహాసభ మక్కపేట సిఎస్ఐ చర్చిలో పాము ప్రభాకర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లవరపు కుటుంబరావు, జి.నటరాజు మాట్లాడుతూ దళిత గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడంలేదన్నారు. మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జగనన్న ఇళ్ల పేరుతో దళిత, గిరిజనులు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములను ఇళ్ల స్థలాలుగా తీసుకొని దళితులకు సెంటు భూమి లేకుండా చేశారన్నారు. మోడీ ప్రవేశపెట్టిన విద్యుత్ ఛార్జీల సవరణ చట్టాన్ని రాష్ట్రంలో ఆమోదించటంతో పేద రైతులకు కరెంటు చార్జీలు, స్మార్ట్ మీటర్ చార్జీలు భారంగా మారాయన్నారు. దళిత, గిరిజనులకు ఉచిత విద్యుత్ ఎత్తివేశారన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో పెనుగంచిప్రోలులో జరిగే కెవిపిఎస్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వత్సవాయి కెవిపిఎస్ మండల అధ్యక్షునిగా బోతపల్లి బిక్షం, ఏసుపోగు ప్రభుదాస్ ఉపాధ్యక్షులుగా, కనకపూడి నాగభూషణం కార్యదర్శిగా, పాము ప్రభాకర్ సహాయ కార్యదర్శిగా, రాయల వెంకట్ కోశాధికారిగా తదితరులతో నూతన కమిటీ ఎన్నికైంది.



పల్లపోతు మురళికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-వన్‌టౌన్

రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షునిగా నియమితులైన పల్లపోతు మురళిని 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మురళికి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో చల్లంరాజు వారి సత్రం ధర్మకర్త చిల్ల సుగుణ వెంకటేష్, పక్కుర్తి రామకష్ణ, పిళ్లా ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

'మహిళా సమైక్య అభివృద్ధికి కృషి'



ప్రజాశక్తి-వత్సవాయి: మండలంలో మహిళా సమైక్య అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష రమేష్ అన్నారు. వత్సవాయి మండల పరిషత్ కార్యాలయంలో మండల మహిళా సమైక్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల మహిళా సమైక్య అధ్యక్షురాలుగా గంగిపోగు శిరీష రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమెతో పాటు 17 మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి చెందినప్పుడే ఆ ఇల్లు, గ్రామం అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు గాదెల రామారావు, జడ్పిటిసి ఏసుపోగు దేవమని, శ్రీనివాసరావు, జిల్లా స్టేడియం కమిటీ సభ్యులు భూక్య రాజా నాయక్, భీమవరం సొసైటీ ప్రెసిడెంట్ చింతకుంట్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌పై రెక్కీని ఖండిస్తూ నిరసన



ప్రజాశక్తి-వన్‌టౌన్: పవన్ కల్యాణ్‌పై రెక్కీని ఖండిస్తూ కాళేశ్వరరావు మార్కెట్ కూడలి వద్ద జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకటమహేష్ ఆధ్వర్యంలో మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ జగన్ ఫ్యాక్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పవన్‌కల్యాణ్ ఇంటి వద్ద రెక్కీకి తాడేపల్లి ప్యాలెస్‌లో కుట్ర పన్నారన్నారు. పవన్‌కల్యాణ్‌పై చిన్న గీత పడినా వైసిపి తలరాతలు మారిపోతాయని, ఎపి నుంచి వైసిపి నాయకులను తరిమికొడతామని హెచ్చరించారు. విశాఖపై ఎవరు స్పందించినా తాడేపల్లి ప్యాలెస్‌లో భూకంపాలు వస్తున్నాయన్నారు. ఎపిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొంతెత్తితే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. వైసిపి విముక్తి ఆంధ్రప్రదేశ్ కావాలంటే ప్రజలంతా కలిసి రావాలన్నారు. విశాఖ, హైద్రాబాద్ ఘటనపై డిజిపి ఎందుకు స్పందించడం లేదో సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శిగినం శెట్టి రాము గుప్తా, నల్లబెల్లి కనకారావు, తమ్మిన లీలా కరుణాకర్, జెల్లి రమేష్, మల్లెపు విజయలక్ష్మి, బత్తుల వెంకటేష్, కూరాకుల సురేష్, వేంపల్లి గౌరీ శంకర్, తిరపతి సురేష్, ఏలూరు సాయి శరత్, పొట్నూరి శ్రీనివాసరావు, సోమీ గోవింద్, రెడ్డిపల్లి గంగాధర్, ఆకుల రవి కిరణ్, బొమ్మ రాంబాబు, అలియా బేగం, విజయ్ కుమారి, రజిని తదితరులు పాల్గొన్నారు.

కంచలలో ఇసుక అక్రమ రవాణా



ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మండలం కంచల గ్రామంలో ఇసుక అక్రమ రవాణా తవ్వకాలు అడ్డగోలుగా చేస్తున్నారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. పరిమితికి మించి ఇసుక టిప్పర్ల ద్వారా రవాణా చేస్తున్న అధికారులు పట్టించుకోవటం లేదు. అనుమతి పత్రాలు అడిగితే ఒకరిపై ఒకరి చెప్పుకుంటూ దాటవేత వేస్తున్నారు. నదీ గర్భంలో ఇసుక రవాణా చేస్తున్న ఆయా శాఖల అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఎంత ఇచ్చారో ఎంత తగ్గారో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొంది. నందిగామ మండలం కంచల గ్రామంలో ఇసుక అక్రమ రవాణాను గ్రామస్తులు నిలిపివేశారు.బిల్లుపై అనుమతి ఒకచోట తవ్వకాలు మరొక చోట జరుగుతున్నాయి. ఉన్నతాధికారులు తక్షణం స్పందించి అధికారులతో పాటు ఇసుక మాఫియాపై చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలి : సిఐటియు



మాట్లాడుతున్న ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమల

ప్రజాశక్తి-నందిగామ: ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నందిగామ మండలంలోని గొల్లమూడి నందిగామ అనాసాగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆశా వర్కర్స్ యూనియన్ మహాసభ నందిగామ సిఐటియు ఆఫీసులో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కమల మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా ఆశ వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని భారం తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కె.గోపాల్ పాల్గొన్నారు. అనంతరం గోళ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధ్యక్షులుగా కె.మార్తమ్మ, కార్యదర్శిగా వి.ఆదిలక్ష్మి, సహాయ కార్యదర్శిగా ఎన్.సునీత, జాయింట్ సెక్రటరీగా త్రివేణి, కోశాధికారిగా నిర్మల, అనాసాగరం పిహెచ్ సి కమిటీ కార్యదర్శిగా జి.కవిత, ఎస్.పద్మ ఎస్.కుమారిలను ఎన్నుకున్నారు.



నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: తిరుమలగిరి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరిగే నిత్యాన్నదానం నిమిత్తం జొన్నలగడ్డకు చెందిన కొండవీటి మల్లికార్జునరావు, స్వప్న రూ.10,116 శుక్రవారం విరాళంగా అందజేశారు. ఈ నెల 8వ తేదీ ఉదయం 8 గంటల నుండి చంద్రగ్రహణం కారణంగా శ్రీ స్వామి వారి ఆలయం మూసివేసి మరుసటి రోజు 9వ తేదీ ఉదయం 10 గంటలకు సంప్రోక్షణ అనంతరం యాత్రికులకు దర్శనం కల్పించడం జరుగుతుందని ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ పసుపులేటి రాధాసుబ్రహ్మణ్యేశ్వరరావు, ఇఒ డి.శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.

వాహనాన్ని ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి-కంచికచర్ల: పేరలకపాడు అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై గురువారం ఆర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసు అందించిన సమాచారం మేరకు చిల్లకల్లుకు చెందిన బొబ్బ నరేంద్ర (39) విజయవాడ నుంచి బైక్‌పై చిల్లకల్లు వెళ్తున్నాడు. పేరకలపాడు అడ్డరోడ్డు సమీపంలోకి రాగానే ఎదురుగా ఆగిఉన్న వాహనాన్ని బైక్ ఢీకొనడంతో నరేంద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ సుబ్రమణ్యం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హారికకు అభినందన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: గత నెల 29 న పట్టణంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇండోర్ స్టేడియం నందు జరిగిన జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయి స్కూల్స్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సెలక్షన్ లో 44 కేజీల కేటగిరి అండర్ 17 బాలికల విభాగంలో చిల్లకల్లు ఆల్ సైన్స్ స్కూల్ చెందిన హారిక ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను అభినందించారు.



సాహస ప్రయాణం...రోగులకు వైద్య సేవలు

ప్రజాశక్తి-నాగాయలంక

ఒక పక్క కృష్ణా నదికి వరద పోటు.. మరోపక్క వర్షాలు.. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన వైద్య సేవలు..! ఈ నేపథ్యంలో అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్



పడవలో అంబులెన్స్‌తోపాటు వెళ్తున్న సిబ్బంది

(ఎఇఎంఎస్) వారి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 104 సంచార వైద్య సేవలు, కొత్తగా ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ (కుటుంబ వైద్యం) వైద్య బృందం అంతా షెడ్యూల్ ప్రకారం గురువారం ఫంటుపై నది దాటి వరద పోటు సమయంలో గంటకు పైగా పడవలో ప్రయాణం చేశారు. చుట్టూ నది నీరు, సముద్రం ఉన్న ఎదురు మొండి దీవులకు సాహసోపేతమైన ప్రయాణం చేసి అక్కడి దీవుల్లోని పేద ప్రజలకు వైద్య సేవలను అందించారు. వర్షాకాలం కావడంతో ఎదురు మొండి వరకు ఫంటు దాటి వెళ్లినప్పటికీ.. అక్కడనుండి నాచుగుంట వెళ్లడానికి ఉన్న ఆరు కిలోమీటర్ల రహదారి మార్గంలో మూడు కిలోమీటర్ల మేర మట్టి రహదారి ఉంది. వర్షం కురవడంతో మట్టి రహదారి బురద కయ్యిగా మారి 104 వాహనం వెళ్లే పరిస్థితి లేదు. దీంతో ఈ పరిస్థితిని 104 మచిలీపట్నం డివిజన్ ఆపరేషనల్ ఎగ్జిక్యూటివ్ కాలారి శ్రీనివాస పెరుమాళ్ళు 104 జిల్లా మేనేజర్ (డిఎం) సిహెచ్ శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారిణి (డిఎంఅండ్‌హెచ్‌ఒ) గీతాభాయికి విన్నవించగా.. ఎట్టి పరిస్థితుల్లోనూ దీవుల గ్రామాలకు వైద్య సేవలు ఆగడానికి వీల్లేదని చెప్పారు. వారి ఆదేశాలతో మచిలీపట్నం డివిజన్ ఒఇ ఫంటు వద్ద పరిస్థితిని సమీక్షించి.. అక్కడ ఎదురు మొండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజేశ్వరరావుతో మాట్లాడారు. ఫంటు దాటి ఎదురు మొండి వైపు 104 వాహనం దిగేటప్పుడు... నదికి వరద పోటు ఉండి..ప్రతికూల పరిస్థితులతో వాహనానికి ఇబ్బంది ఏర్పడే పరిస్థితులు ఉన్నాయని తెలుసుకున్నారు. అయినప్పటికీ రాష్ట్రప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ (కుటుంబ వైద్యం) గ్రామీణ ప్రాంతాలకు చేరాలనే సంకల్పంతో 104 డిఎం. శ్రీనివాస్ ప్రత్యేక సూచనలతో ఒఇ శ్రీనివాస పెరుమాళ్ళు దగ్గరుండి 104 వాహనాన్ని ఫంటు ఎక్కించి ఎదురు మొండి దాటి నాచుగుంట వైపు వాహనాన్ని తరలించారు. నాచుగుంట వరకు ఉన్న ఆరు కిలోమీటర్ల రహదారిలో మూడు కిలోమీటర్ల మేర ఉన్న తారు రహదారిని దాటి.. వాహనం మట్టి రహదారి వరకు చేరి ఆగిపోయింది. వర్షం కురిసిన కారణంగా మట్టి రోడ్డులో వాహనం వెళ్లే పరిస్థితి



నాటు పడవలో మందులను తీసుకెళ్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

లేకపోవడంతో.. ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకొని.. నాచుగుంట గ్రామ సర్పంచ్ చెన్ను విజయ భర్త వెంకటేశ్వరరావు సహకారంతో 104 వైద్య బృందానికి, కుటుంబ వైద్య బృందానికి ఎదురు మొండి నుండి నదిలో పడవను ఏర్పాటు చేయించారు. ఎట్టకేలకు సాహసోపేతంగా గంటకు పైగా నదిలో ప్రయాణం చేసి..నాచుగుంట సచివాలయ పరిధిలోని ఈలచెట్లదిబ్బ గ్రామ ప్రజలకు కుటుంబ వైద్య విధానంలో వైద్య సేవలను అందించారు. ఈ శిబిరంలో 40 మంది రోగులకు బిపి షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా నెలకి సరిపడా మందులను అందించారు. ఈ కార్యక్రమంలో 104 సంచార వైద్య శిబిరం వైద్యాధికారి కె.ఆదిత్య శంకర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజేశ్వరరావు, హెచ్.వీ కే. విజయవల్లి, 104 డీఈవో డి.గంగాభవాని, సిబ్బంది జి.గిరి పవన్, ఎంఎల్ హెచ్‌పి కే మౌనిక, ఏఎన్ఎం. జి ఝాన్సీ రాణి, ఆశ కార్యకర్త వరలక్ష్మి పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు

పమిడిముక్కల ఎపిఒ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-పమిడిముక్కల

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో మొక్కల పెంపకాన్ని చేపట్టి వాటి సంరక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నామని ఎపిఒ వెంకటేశ్వరరెడ్డి చెప్పారు. మండలంలోని అమీనాపురంలో 60 మందికి పైగా కూలీలు మొక్కలకు పాదులు చేయటమే కాకుండా వాటికి కర్రలతో



మొక్కల రక్షణకు ఏర్పాట్లు చేస్తున్న ఉపాధి కూలీలు

సంరక్షణ కల్పించారన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. 12 రోజులపాటు పనులు కల్పిస్తున్నామన్నారు. ముళ్ళపూడి పంచాయతీతోపాటుగా తాడంకి, లంకపల్లి, కృష్ణాపురం, మేడూరు పంచాయతీల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధికారులు మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. మొక్కలను పెంచటం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయన్నారు. ప్రాణవాయువును పెంచే ఆక్సిజన్‌ను అందించటానికి దోహదపడతాయని వివరించారు. మొక్కల సంరక్షణకు గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ లాంటి పెద్ద దేశ నేతలే కృషిచేశారని వివరించారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని వెంకటేశ్వరరెడ్డి కోరారు.

అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపన

ప్రజాశక్తి-చల్లపల్లి

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు. నాడు-నేడు నిధులతో చల్లపల్లి శివారు గంగుల వారి



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సింహాద్రి రమేష్‌బాబు

పాలెంలో రూ.22 లక్షలతో నూతన అంగన్వాడీ కేంద్ర భవనం నిర్మాణానికి, ఎస్టీ కాలనీలో ఎంపీపీ రవీంద్రభారతి స్కూలులో రూ.11.98 లక్షలతో నూతన మరుగుదొడ్లు, మేజర్ రిపేర్లకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావులు సంయుక్తంగా శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, మొవ్వ ఐసిడిఎస్ సిడిపిఒ భానుమతి, మండల విద్యాశాఖ అధికారి కొడాలి రాజ్ కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి, ప్రముఖ న్యాయవాది ఎంపీటీసీ సభ్యులు మోతుమూడి ద్వారకానాథ్, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

మద్యం దుకాణాలకు అనుమతి ఇవ్వొద్దని వినతి

ప్రజాశక్తి-కోడూరు

కోడూరులోని మూడు, ఐదు వార్డుల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయాలన్న అధికారుల ప్రయత్నాన్ని విరమించుకోవాలని స్థానిక మహిళలు జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎక్సైజ్ అధికారులు స్పందించారు. మహిళలు ఫిర్యాదులో తెలిపిన విధంగా 3, 5 వార్డుల్లో లిక్కర్ దుకాణం ఏర్పాటుకు గుర్తించిన షాపుల ప్రక్కన ఉన్న నివాస గృహాలను,12 అడుగుల వెడల్పు గల రోడ్డును, రోడ్డు వెంబడి బాల బాలికలను పాఠశాలలకు వెళున్నారా లేదా?? అన్న విషయాన్ని గుడివాడ డిపో ఎక్సైజ్ ఎస్సై మధు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో ఆలోచన చేయాలనీ, నివాసాల మధ్య లిక్కర్ దుకాణం ఏర్పాటు చేయటం వల్ల నిత్యం మద్యం షాపుకు వచ్చే వారి వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. అసాంఘిక శక్తులు ఈ ప్రాంతానికి వచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రస్తుతం ఉన్న షాపు వద్దనే నిత్యం వివాదాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. నివాసాల పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే క్రమేణా మహిళలకు రక్షణ కరువయ్యే పరిస్థితి కూడా ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. అధికారులు స్పందిస్తూ పై అధికారులకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

నేడు గన్నవరంలో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-గన్నవరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గడప గడపకూ మన ప్రభుత్వం గన్నవరం గ్రామంలో శనివారం గన్నవరం సచివాలయం-1 పరిధిలో జరుగుతుందని సర్పంచ్ నిడమర్తి సౌజన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ పాల్గొని గడప గడపకు తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు.

దీపక్ నెక్స్ జెన్‌లో అయ్యప్పల పడిపూజ

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్

బాపులపాడు మండలం బొమ్మలూరు గ్రామంలోని దీపక్ నెక్స్ జెన్ పరిశ్రమలో గురువారం రాత్రి 4వ అయ్యప్ప పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. నెక్స్ జెన్ మేనేజింగ్ డైరెక్టర్ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అనూహ్యంగా అయ్యప్ప భక్తులు



వేలాదిగా తరలివచ్చారు. ప్రొఫెసర్ సి.వి.బి, సుబ్రహ్మణ్యం, స్వామీ జ్ఞానానంద్ గిరి మహారాజ్‌లు ఆధ్యాత్మిక ప్రవచనాలు చదివారు. అనంతరం కోదాడ భాస్కరస్వామి, జంగిరెడ్డి భజనలు ఆకట్టుకున్నాయి. నెక్స్ జెన్ ఎండి అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తడికమళ్ళ గురుస్వామి పర్యవేక్షించారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, దీపక్ నెక్స్ జెన్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

శ్రీకాకుళంలో అక్రమంగా ఇసుక రవాణా

ప్రజాశక్తి-ఘంటసాల

ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం పాపవినాశనం మధ్య కృష్ణానదిలోకి బాట వేసి భారీస్థాయిలో టిప్పర్లతో అక్రమార్కులు గత రెండు రోజుల నుంచి ఇసుక తరలిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. కృష్ణానది వరద కారణంగా గడిచిన మూడు నెలల నుంచి ప్రకాశం బ్యారేజీకి దిగునా ఎక్కడా ఇసుక తవ్వకాలకు అనువుగా లేకపోవడంతో ఇసుక సరఫరా లేక వినియోగదారులు ఇబ్బందులకు గురవుతుండగా దీన్ని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. వరద నీటిలో సైతం ప్రమాదకరంగా బాటలు వేసి తమకు ఇసుక రవాణాకు అనుమతులు సైతం ఉన్నాయని రాష్ట్రంలో ఇసుకకు ప్రధాన గుత్తేదారు అయిన జేపీ కంపెనీ వద్ద నుంచి సబ్ కాంట్రాక్ట్ గా అనుమతులు తీసుకున్నామని భారీ స్థాయిలో ఇసుకను తరలించి చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా అధికార యంత్రాంగం చుట్టుపక్కల కనిపించకపోవడం పట్టించుకోకపోవటంతో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి.



అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత

ముళ్లపూడి సర్పంచ్ పక్కాల అంజిబాబు

ప్రజాశక్తి-పమిడిముక్కల

గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నామనీ, నిరంతరం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని పమిడిముక్కల మండలం ముళ్లపూడి గ్రామ పంచాయతీ సర్పంచ్ పక్కాల అంజిబాబు చెప్పారు. ఆయన ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. గ్రామాభివృద్ధిలో భాగంగా రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు వంటి మౌళిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుదలకు కృషిచేస్తున్నామన్నారు. గ్రామ ప్రజలకు రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలు పూర్తిస్థాయిలో అందేలా కృషిచేస్తున్నామని వివరించారు. అమ్మ ఒడి, గ్రామ, వార్డు సచివాలయాల నిర్మాణం, రైతు భరోసా లాంటి కార్యక్రమాలు అందరికీ ఉపయోగపడుతున్నాయన్నారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని గ్రామాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారని చెప్పారు. మండల అధికారుల సమావేశంలో గతంలో అనేక సమస్యల గురించి చర్చించామని తెలిపారు.



నాటకాల సిఎంను సాగనంపాలి

(మొదటి పేజీ తరువాయి)

మోహన్ రెడ్డి మద్యం, ఇసుక, గ్రావెల్ అక్రమంగా దోచుకుంటూ ప్రభుత్వ ఖజనాను లూటీ చేస్తున్నారని విమర్శించారు. సుబాబుల్ పంటకు రూ.5 వేలు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చిన ముఖ్య మంత్రి నేడు రూ.2 వేలకు కూడా కొనటం లేదన్నారు. కరెంటు మీటర్లు బిగిస్తూ రైతుల మెడలకు ఉరి తాళ్లు వేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల తర్వాత జగన్‌కు జైలు జీవితం తప్పదని పేర్కొన్నారు. వైసిపి నాయకులు అవినీతి అక్రమాలకు పాల్పడుతుంటే పవన్ కళ్యాణ్ చెప్పు చూపటంలో తప్పు లేదన్నారు. రాష్ట్రంలో విద్యుత్ తీగలు తగిలి ఆరుగురు చనిపోయినా, సిఎం క్యాంప్ కార్యాలయం వద్ద మహిళ చేసుకుని ఆత్మహత్యానికి పాల్పడినా ముఖ్యమంత్రిలో చలనంలేదన్నారు. విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్, మాజీ మంత్రులు నెట్టెం రఘురాం, దేవినేని ఉమామహేశ్వరరావు, నందిగామ మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య ప్రసంగించారు.

పరిటాలలో ఘన స్వాగతం

కంచికచర్ల మండలం పరిటాల వద్ద కంచికచర్ల, వీరులపాడు మండలల్లోని ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు బైకులు, కార్లు, ఆటోలలో భారీగా పరిటాల సమీపంలో గల బైపాస్ రోడ్డుకు చేరుకున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు చంద్రబాబు పరిటాలలో కారులోనుంచి బయటకు వచ్చి ప్రజలకు అభివాదం చేశారు. అక్కడ టిడిపి జెండాల మధ్యలో జనసేన జెండా కూడా ఉంది. చంద్రబాబుకు కరచలాన చేసేందుకు పోటీపడ్డారు. భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. రెండు నిమిషాలపాటు రోడ్డుపై నిలిచిన చంద్రబాబు కాన్వాయ్ ఆ తర్వాత ముందుకు సాగింది. ఈకార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కోగంటి బాబు, వీరులపాడు మండల అధ్యక్షుడు కొంద్రగుంట శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు దాములూరు మధుసూధనరావు, మాగంటి పుల్లారావు, బాబు, మాజీ ఎంపీపీలు, పరిటాల బాగ్యలక్ష్మీ, అల్లడి కోటేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల తర్వాత జగన్ జైలుకే : చంద్రబాబు

2024 ఎన్నికల తర్వాత జగన్ రెడ్డి పోయేది జైలుకేనని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బంగాళాఖాతంలో కలుస్తుందనీ టిడిపి అధినేత చంద్రబాబు అన్నారు. పట్టణంలో శుక్రవారం రాత్రి రోడ్ షో నిర్వహించిన అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని నాని అధ్యక్షతన జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి గ్రూపుల హడావుడి

విజయవాడ కుమ్మరిపాలెం సెంటర్‌లో టిడిపిలోని రెండు గ్రూపుల వారు హడావుడి చేశారు. ఒకపక్క ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జి బుద్ధా వెంకన్న, మరోపక్క ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) గ్రూపులు టిడిపి జెండాలను చేతబట్టి హడావిడి చేశారు. చంద్రబాబు కుమ్మరిపాలెం సెంటర్‌కు రాగానే వారు బుద్ధా వెంకన్న జిందాబాద్, కేశినేని నాని జిందాబాద్ అంటూ పెద్దపెట్టున నినదించారు. చంద్రబాబు కుమ్మరిపాలెంలో కారు ఒక క్షణ ఆపి పార్టీ నాయకులకు చేతులు ఊపుతూ కిందకు దిగకుండానే వెళ్ళిపోయారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బుద్ధా వెంకన్న, నాయకులు కె.నాగుల్ మీరా, పట్టాభి, మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, యేదుపాటి రామయ్య, దూది బ్రహ్మయ్య యాదవ్ ఘన స్వాగతం పలికారు.

సానుభూతి కోసం కొత్త డ్రామాలు : వైసిపి ఎంఎల్‌సి అరుణ్‌కుమార్

సానుభూతి కోసం చంద్రబాబు కొత్త డ్రామాలు ఆడుతున్నారని వైసిపి ఎంఎల్‌సి మొండితోక జగన్మోహనరావు అన్నారు. నందిగామ వైసిపి కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ 'రాయి వేసింది టిడిపి నాయకులేనని, వేయించుకుంది ఆ పార్టీ నాయకులేనని అన్నారు. వైసిపి వారు రాళ్ల దాడి చేశారని ఆరోపణలు చేయడం హేయమన్నారు. రోడ్ షోకు భారీగా జనం తరలివచ్చారని టిడిపి నేతలంటున్నారని, చుట్టూ టిడిపి వాళ్లే ఉంటే అంత దగ్గరగా వేరేవాళ్లు రాయి విసరటం సాధ్యమా అని ప్రశ్నించారు. అసలు రాయి వేయలేదని, కింద ఉన్న చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌ను పైకి తీసుకొచ్చి రక్తం వస్తోందని చెప్పి డ్రామా రక్తి కట్టించడానికి చంద్రబాబు దుర్మార్గపు ఆలోచనలు చేశారని విమర్శించారు. తాము అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే ఎక్కడైనా ప్రమాణం చేయడానికి సిద్ధమన్నారు.

రోడ్ షోలో రాయితో దాడిపై విచారణ : సిపి

చంద్రబాబు రోడ్ షోలో రాయి పడిన ఘటనపై ఎన్‌టిఆర్ జిల్లా పోలీసులు ప్రత్యేక దష్టి సారించారు. డిసిపి విశాల్ గున్ని ఆధ్వర్యంలో దర్యాప్తు బందాలను ఏర్పాటు చేసినట్లు ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా తెలిపారు. రోడ్ షోలో రాయి పడిన ప్రాంతాలతోపాటు పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులెవరైనా సంచరించారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈఘటనపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

భ్రమరాంబపురం వాసులకు ఇళ్ల పట్టాలపై నివేదిక : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : కృష్ణలంక భ్రమరాంబపురం ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నివాసముంటున్న వారికి పట్టాలను మంజూరు చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు తెలిపారు. కృష్ణలంక భ్రమరాంబపురంలో ఆక్రమణలను శుక్రవారం ఆయన రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణానదీ తీరాన పద్మావతి ఘాట్‌ను ఆనుకుని ఉన్న భ్రమరాంబపురంలో గతంలో 21 సర్వే నెంబర్లకు చెందిన 23.16 ఎకరాల భూమిని రుద్రభూమికి కేటాయించినట్లు తెలిపారు. దీనిలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిరక్షణలో 14.21 ఎకరాల భూమిలో ప్రస్తుతం ఉన్న గ్యాస్, విద్యుత్, ఫైర్‌వుడ్ ఆధారిత శ్మశానవాటికలను నిర్వహిస్తున్నారన్నారు. మిగిలిన భూములో సుమారు 1180 కుటుంబాలు పూర్వకాలం నుండి ఇళ్లను నిర్మించుకుని నివాసం ఉంటున్నాయన్నారు.

గిరిజన కుటుంబాలకు గృహాల మంజూరుకు చర్యలు

కృష్ణానది వరద కారణంగా తరలించిన పద్మావతిఘాట్ సమీపంలోని లోతట్టు ప్రాంత గిరిజన కుటుంబాలకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా గృహాల మంజూరుకు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. పద్మావతి ఘాట్ సమీపంలో గతంలో కృష్ణానది ఇసుక తిన్నెలపై తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్న యానాది కుటుంబాలకు చెందిన గిరిజనులు శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. కార్యాలయం గేటు ముందు ఫుట్‌పాత్‌పై వేచివున్న గిరిజన కుటుంబాల వారిని అటుగా వాహనంలో వెళుతున్న కలెక్టర్ చూసి తన వాహనాన్ని ఆపారు. దగ్గరకు పిలిపించుకని సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సక్రమంగా ధాన్యం కొనుగోళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్రహీంపట్నం లంక భూముల్లో వరదలకు కూరగాయలు సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ఆరోగ్యశ్రీపై ప్రజలకు విస్తత అవగాహన కల్పించాలని సభ్యులు సూచించారు. ముఖ్యమంత్రి సహాయనిధికి వత్తిడి వస్తోందన్నారు. కంకిపాడు ఆస్పత్రికి కోట్లాది రూపాయల విలువైన స్థలం ఇచ్చిన దాత పేరు పెట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ సారథి కోరారు. నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్మోహనరావు మాట్లాడుతూ విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో హద్రోగ సంబంధిత శస్త్రచికిత్సల సౌకర్యం కల్పిస్తే రోగులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. తర్వాత గహ నిర్మాణ శాఖ పురోగతిపై మంత్రి ఆరా తీశారు. అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ మాట్లాడుతూ అవనిగడ్డ జూనియర్ కళాశాల, హై స్కూల్ నుంచి వెలుపలికి రావాలంటే ప్రభుత్వం లీజుకు ఇచ్చిన గాంధీ క్షేత్రం నుంచి రావాలని ఆ ప్రాంతం అంత పల్లం గా ఉండడంతో వర్షాకాలంలో విద్యార్థిని విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆ ప్రాంతాన్ని మెరక చేయించాలని కోరారు. ఈ సమావేశంలో కష్ణా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు, జడ్‌పి ఇసిఒ జి.శ్రీనివాసరావు, కష్ణా జెసి డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల, కష్ణా డిఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఏలూరు జిల్లా డిపిఒ నిమ్మగడ్డ బాలాజీ, ఎమ్మెల్సీ ఎం.డి.రుహుల్లా తదితరులు పాల్గొన్నారు.

'మన గ్రామం'ను సందర్శించిన వెంకయ్యనాయుడు



ప్రజాశక్తి-పెనమలూరు : పెనమలూరు గ్రామం వద్ద నిర్వహిస్తున్న 'మనగ్రామం' సహజ ఉత్పత్తుల కేంద్రాన్ని శుక్రవారం మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సందర్శించారు. స్వదేశీ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువచ్చి సేంద్రీయ వ్యవసాయ పద్ధతులతో పండించిన ఉత్పత్తులను, తయారైన వంటకాలను అందిస్తున్న ముప్వా రామకృష్ణ, మాధవిలత కుటుంబ సభ్యుల అంకిత భావానికి అభినందనలు తెలిపారు. ప్రకృతి వంటకాలవైపు ఆకర్షితులయ్యేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. మనగ్రామం కేంద్రం ద్వారా ఆర్గానిక్ ఉత్పత్తులను అందిస్తున్నారని, కొన్ని పత్రికలలో చదివి తెలుసుకుని ఈ కేంద్రాన్ని సందర్శించాలనే కోరిక కలిగిందని అన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రోత్సహించాలన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తుల దిగుబడి తక్కువగా ఉండడం వల్ల సహజసిద్ధ ప్రకృతి ఉత్పత్తుల ధరలు కొంత ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు, ఆరికలు, సాములు, ఊదలు వంటి చిరుధాన్యాలతో తయారైన వంటలపై మక్కువ పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మనగ్రామం నిర్వహకులు ముప్వా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కానూరులోని కెసిపి సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులతో ముచ్చటించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారాన్ని స్వీకరించారు. విద్యార్థులు అడిగిన సందేహాలను నివత్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు చదలవాడ నాగేశ్వరరావు, పాలడుగు లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు ఎం.రాజయ్య, వి.నాగభూషణరావు, సంయుక్త కార్యదర్శి ఎన్.లలిత ప్రసాద్, ఎస్.విష్ణు, లా కాలేజ్ కన్వీనర్ ప్రభాస్, గవర్నింగ్ బాడీ సభ్యులు నల్లూరి వెంకటేశ్వర్లు, సిహెచ్. కష్ణారావు, రంగ ప్రసాద్, పాఠశాల కన్వీనర్ వీరపునేని శశికళ, ప్రిన్సిపాల్ మనోజ్ కర్మాకర్, వైస్ ప్రిన్సిపల్ వి.సాయికష్ణ పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనపై వైసిపి ఆరా

ప్రజాశక్తి -కంచికచర్ల : టిడిపి అధినేత చంద్రబాబు నందిగామలో పర్యటనపై వైసిపి నాయకులు నిఘా పెట్టారు. చంద్రబాబు పర్యటనకు ఏ గ్రామం నుంచి ఎవ్వరూ ఎంతమంది వెళ్లారో అనే విషయంపై గ్రామ స్థాయి నాయకుల నుంచి నియోజవర్గస్థాయి నాయకుల వరకు అరా తీసారు. చంద్రబాబు సభకు జనం ఏ మేరకు వెళ్లారో లెక్కలు వేసుకున్నారు. నందిగామ వైసిపి కార్యాలయంలో ఎంఎల్‌సి డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ ఆయా గ్రామాలకు చెందిన ముఖ్యనాయకులకు ఫోన్లు చేసి ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకున్నారు. ఇంటిలిజెన్స్ అధికారులకు కూడా వైసిపి నాయకులు ఎప్పటికప్పుడు ఫోన్లు చేసి ప్రజలు ఎంతమంది వచ్చారో సమాచారం తెప్పించుకున్నారు. పలువురు నాయకులు మాత్రం తమ తమ గ్రామాలనుండి ఎక్కువ మంది వెళ్లలేదని తప్పుడు సమాచారం అందజేసినట్లు తెలిసింది. గ్రామ స్థాయి నాయకులు కొందరు చంద్రబాబు సభకు ప్రజలను వెళ్లకుండా కట్టడి చేసేందుకు ప్రయత్నించారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 7
శనివారం 5 నవంబర్ 2022

సీనియర్ సిటిజన్లకు అన్నదానం

ప్రజాశక్తి నాగాయలంక

నాగాయలంకలోని శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవాలయ ప్రాంగణంలో స్వచ్ఛంద అన్న ప్రసాద వితరణ సేవా కమిటీ ఆధ్వర్యంలో



అన్నదానంలో పాల్గొన్న సీనియర్ సిటిజన్లు

నిరుపేదలైన సీనియర్ సిటిజన్లు, వికలాంగులకు అన్నదానం చేశారు. నాగాయలంక వాస్తవ్యులు పొన్నూరు హరిబాబు (శ్రీ లక్ష్మి ఎలక్ట్రికల్) ద్రాక్షాయిణినాగలక్ష్మి దంపతులు వారి కుమారుడు వెంకటరమణ కోడలు శ్రావణి మనవళ్ళు మణికంఠ,నూతన్, హైదరాబాద్ వాస్తవ్యులు మండవ దుర్గా కుమార్ ,జ్యోత్స్న దంపతులు వారి కుమారుడు ప్రదీప్ గౌతమ్ దాతలు సహాయం చేశారు. చిన్న,లంకమ్మ , బోసు , బుజ్జమ్మ, పడవల సుబ్బారావు, హరిబాబు, తలశిల నారాయణరావు పాల్గొన్నారు.

తిరుపతమ్మకు గాజుల అలంకరణ

గన్నవరం : స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శుక్రవారం గాజుల అలంకరణ ఘనంగా నిర్వహించారు . కార్తీకమాసం ఏకాదశి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు సమర్పించిన 60 వేల గాజులతో అలంకరణ జరిపారు. తొలుత శ్రీలక్ష్మీతిరుపతమ్మతో పాటు అంకమ్మతల్లి విగ్రహాలను, మహాలక్ష్మీ మానుని రంగు రంగుల గాజులతో అందంగా అలంకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ , పలువురు పురప్రముఖులు పాల్గొన్నారు.

నేడు ఉచిత పశువైద్యశిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని శనివారం ఉదయం వడ్లమన్నాడు గ్రామంలో నిర్వహిస్తున్నామని లయన్స్ క్లబ్ అధ్యక్షులు సింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు. వల్లభనేని రామకృష్ణ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటుచేస్తున్నామని పేర్కొన్నారు.

పందులతో భయం..భయం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

మండల కేంద్రమైన గుడ్లవల్లేరు గ్రామంలో



పందులు వీరవిహారం చేస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారు. గుడ్లవల్లేరు సంత రోడ్డు ,పంచాయతీ రోడ్డు, జేమ్స్ పేట ఫస్ట్ వార్డ్ తదితర ప్రాంతాల్లో కొంతమంది పందుల పెంపకదారులు ఇష్టమొచ్చిన రీతిలో వాటిని ఇళ్ల మధ్యలోకి వదిలేయడంతో సమీపంలోకి చెత్త, మురుగు నీరు పేరుకుపోతోంది. అంటు రోగాలు ప్రభలే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా గ్రామస్తులు కోరుచున్నారు.

14, 15 తేదీల్లో వ్యకాస జిల్లా మహాసభ

ప్రజాశక్తి-చల్లపల్లి

ఈనెల 14, 15 తేదీల్లో మొవ్వ మండలం కూచిపూడిలో నిర్వహిస్తున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు యద్దనపూడి మధు వ్యవసాయ కార్మికులకు పిలుపునిచ్చారు.



ప్రశంసాపత్రాలను అందజేస్తున్న అనిల్‌కుమార్

అవినీతి రహిత భారతదేశం కావాలి

ప్రజాశక్తి-గన్నవరం

అవినీతి రహిత, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజయవాడ ఇన్‌కం ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎం.అనిల్ కుమార్ అన్నారు. విజిలెన్స్ అవగాహనా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో కరప్షన్ ఫ్రీ ఇండియా - ఫర్ ఏ డెవలప్డ్ నేషన్ అనే ఇతివృత్తంపై సమావేశం జరిగింది. విమానాశ్రయ డైరెక్టర్ ఎం. లక్ష్మీకాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అనిల్ కుమార్ మాట్లాడారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ వారోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. ఉద్యోగులతో పాటు యువతను కూడా అవినీతిపై చేసే పోరాటానికి భాగస్వాములు చేయడమే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఓ స్వచ్ఛంద సంస్థకు రక్తదానం చేసిన విమానాశ్రయ సిబ్బందికి ప్రశంసా పత్రాలను అనిల్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విమానాశ్రయం ఫైనాన్స్ విభాగం జాయింట్ జనరల్ మేనేజర్ బి.వి.సూర్య భగవానులు, ఎలక్ట్రికల్ విభాగం జాయింట్ జిఎం పి.వి.రామారావు, మానవ వనరుల విభాగం మేనేజర్ ఏ.మాధవిరాణి, విమానాశ్రయ భద్రతాధికారి కె.వెంకటరత్నం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీక స్నానాలకు ఏర్పాట్లు : తహశీల్దార్



మాట్లాడుతున్న తహశీల్దార్ ఎస్‌కె లతీఫ్‌పాషా

ప్రజాశక్తి-కోడూరు

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల ఏడోతేదీన కార్తీక సోమవారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పుణ్య స్నానాలు ఆచరిస్తారని ముందస్తు అంచనాలతో వివిధ శాఖ అధికారులతో భక్తులకు అవసరమైన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామని కోడూరు తహశీల్దార్ ఎస్కే లతీఫ్ పాషా తెలిపారు. శుక్రవారం జరిగిన ఈ సమీక్షా సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ సముద్రంలో పుణ్య స్నానాలు ఆచరించే యాత్రీకులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. వివిధ శాఖ అధికారులతో చర్చించి ఈ సమావేశంలో ఆయా శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అవనిగడ్డ సీఐ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సాగర సంగమ ప్రదేశానికి వెళ్లడానికి రహదారి సౌకర్యం లేనందున ముందస్తు అంచనాలతోనే స్నానాలకు అనుమతులు లేవన్నారు. సముద్ర తీరం వద్ద యధావిధిగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించొచ్చునన్నారు. యాత్రికులకు 200 మంది పోలీస్ సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. భారికేడ్లు, మరుగుదొడ్లు, స్త్రీలు దుస్తులు మార్చుకోవటానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సమావేశానికి ఇన్చార్జి ఎంపిడిఒ నాగ రేవతి, ఎస్ఐ పి.నాగరాజు, పంచాయతీ ఇఒ యలవర్తి సుబ్రమణ్యం, హంసలదీవి గ్రామపంచాయతీ సర్పంచ్ కొక్కిలిగడ్డ బిక్షం, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వర్ల కుమార్‌రాజా

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి : వర్ల

ప్రజాశక్తి-పెదపారుపూడి

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వ పాలనలో వైఫల్యాలను ఎండగట్టేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్ల కుమార్ రాజా కోరారు. పెదపారుపూడి మండలం యలమర్రు గ్రామంలో బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా ఆయన రెండోరోజూ పర్యటించారు. ప్రతి ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేశారు. సిఎం వైఎస్ జగన్ అస్తవ్యస్త పాలన అందిస్తున్నారన్నారు. ప్రశ్నించే వారిపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పెదపారుపూడి మండల అధ్యక్షులు చలసాని రమేష్(చంటి), కార్యదర్శి మసిముక్కు రాంబాబు, మాజీ ఎంపీపీ కాజ విజయలక్ష్మి, గ్రామ సర్పంచ్ కొల్లూరి అనూష, చెరుకూరి విజయ్‌కుమార్, వేము వెంకటేశ్వరరావు, కాటం వెంకట్, మేడేపల్లి శాంతరాజు, ముత్యాలు, కాటూరి సుధీర్, అప్పికట్ల శరత్ బాబు, దేవరపల్లి సుబ్బారావు, కంభం రాజేష్, గుమ్మడి సత్యం,వాక స్వామి, చెరుకూరి రమేష్, అన్నే పూర్ణ, అన్నే బాబ్జి, కుదరవల్లి ఉమా, తుమ్మపూడి హరీష్, తుమ్మపూడి చలం, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణీకులకు బహుమతులు

మచిలీపట్నం రూరల్ : గిఫ్ట్ స్కీములో భాగంగా అక్టోబర్ 16 నుండి 31 వరకు ఏలూరు, విజయవాడ, బంటుమిల్లి రూట్లలో ప్రయాణించిన వారిలో లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసిన ముగ్గురు ప్రయాణీకులకు హైదర్ జ్యూయలరీ సౌజన్యంతో



బహుమతులు అందజేస్తున్న ప్రజారవాణా అధికారి జి.నాగేశ్వరరావు

బహుమతులు ప్రజా రవాణా అధికారి జి.నాగేశ్వరరావు చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఈ గిఫ్ట్ స్కీమ్‌లో టి.దుర్గా మహాలక్ష్మి ఉపాధ్యాయులు, మచిలీపట్నం, మునీర్ సచివాలయ సెక్రటరీ, 34 వ వార్డు, బంటుమిల్లి, జి. ప్రమీల, ప్రైవేటు ఉద్యోగిని, లక్ష్మీనారాయణపురం, గుడివాడ విజేతలుగా నిలిచారు. ఈ బహుమతులు ప్రతి 15 రోజులకొక సారి లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసిన ప్రయాణీకులకు బహుకరిస్తామని మచిలీపట్నం డిపో మేనేజర్ టి.పెద్దిరాజు తెలిపారు.

పవన్‌కు జెడ్ ప్లస్ రక్షణ కల్పించాలని నిరసన

అవనిగడ్డ : జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు జడ్ ప్లస్ భద్రత కల్పించాలని డిమాండ్‌చేస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని సీతాయిలంక అంబేద్కర్ విగ్రహం ఎదుట మోకాళ్లపై నుంచొని మౌన నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, పార్టీ కార్యదర్శి గాజుల శంకరరావు, మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు, ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, కటికల వాసంత్, అశ్వరావు పాలెం ఉపసర్పంచ్ యక్కటి నాగరాజు, మునిపల్లి శ్రీలక్ష్మి, మత్తి శివ పార్వతి, బండే నాగమల్లేశ్వరి, బొచ్చు కష్ణకుమారి, బచ్చు రఘునాథ్, కైతేపల్లి రాజేష్, చెన్ను వాల్మీకి, రేపల్లె రంగనాథ్, దాసినేని నాగరాజు, తుంగల నరేష్, కోసూరు అవినాష్, రేపల్లె రోహిత్, అప్పికట్ల భాస్కర్, గరికపాటి శ్రీనివాస్, భోగిరెడ్డి నాగేశ్వరరావు, మండలి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



అనాథ వృద్ధురాలికి శేషమాధవి ఆసరా

గన్నవరం : ఉంగుటూరు గ్రామంలో వెంకటేశ్వర స్వామి గుడి వద్ద ఒక అనాథ వృద్ధురాలు దీనస్థితిలో ఉండటాన్ని గమనించిన స్థానికులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఆమెను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి అనాథ వృద్ధురాలిగా గుర్తించి బి కే ఆర్ వృద్ధాశ్రమం చైర్మన్ కానూరి శేషు మాధవికి ఆమెను అప్పగించారు. ఏమి మాటలు రాని, తన వివరాలు సైతం చెప్పలేని వృద్ధురాలి దీనస్థితిని చూసి కానూరి శేషు మాధవి చలించి పోయారు. ఆమెకు అవసరమైన ఏర్పాట్లు ఆశ్రమంలో చేస్తామని తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా కృష్ణాజిల్లాలో అనాథ వృద్ధులను అక్కున చేర్చుకుని సేవలందిస్తున్న శేషు మాధవిని పోలీస్ సిబ్బంది అభినందించారు.



వృద్ధురాలితో కానూరి శేషుమాధవి

నేడు సజ్జా రాజేష్ భౌతికకాయం రాక

ప్రజాశక్తి-చల్లపల్లి

చల్లపల్లి గ్రామ మాజీ సర్పంచి సజ్జా వెంకటేశ్వరరావు చిన్న కుమారుడు సజ్జా రాజేష్ గత నెల 27వ తేదీన అమెరికాలో మరణించారు. ఆయన భౌతికకాయం శనివారం చల్లపల్లికి చేరుకుంటుంది. ఆదివారం ఉదయం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి అంతిమయాత్ర బయలుదేరుతుందని పేర్కొన్నారు.

ఆంధ్రా ఆస్పత్రిలో విజయవంతంగా గుండె శస్త్రచికిత్సలు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: నగరంలోని ఆంధ్రా హాస్పటల్స్ నందు చిన్న పిల్లల గుండె శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి డైరెక్టర్, ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పి.వి.రామారావు తెలిపారు. గవర్నరుపేటలోని ఆంధ్రా హాస్పటల్ నందు శుక్రవారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర హాస్పటల్స్, హీలింగ్ లిటిల్ హార్ట్స్, యుకె ఛారిటీ సౌజన్యంతో ఉచితంగా పిల్లల గుండె సర్జరీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబరు 31 నుండి ఈనెల 5వ తేదీ వరకు ఉచిత పిల్లల గుండె సర్జరీలను నిర్వహిస్తున్నట్లు తెలియచేశారు. గత ఏడు సంవత్సరాల నుండి ఇప్పటి వరకు 24 సార్లు ఆంధ్ర హాస్పటల్స్‌కు వచ్చి పిల్లల గుండె సర్జరీలను యుకె వైద్యులు నిర్వహించారని తెలిపారు. ఇప్పటివరకు 2800 ఆపరేషన్లు, ఇంటర్వెన్షన్స్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. తమ వైద్య బృందంలో పిల్లల గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ విక్రమ్, గుండె సర్జన్ డాక్టర్ దిలీప్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ నుండి డాక్టర్ ప్రేమ్ వేణుగోపాల్, డాక్టర్ సరఫరాజ్ రహీమాన్, డాక్టర్ మహమ్మద్, సౌమ్య, రాజేంద్రన్ ఉన్నారని తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ రామారావు



15వ డివిజన్‌లో సిసి రోడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక 15వ డివిజన్‌లో సిసి రోడ్ల నిర్మాణానికి, రుద్రభూమి ఎస్‌టిపి ప్లాంట్ చుట్టూ కాంపౌండ్ వల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. వైసిపి తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి పనుల శంకుస్థాపనలో పాల్గొన్నారు. రూ. 37 లక్షల ప్రభుత్వ నిధులతో జరిగే పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అవినాష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ బెల్లందుర్గ మాట్లాడుతూ...వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చల్లారావు, వైసిపి నాయకులు కొల్లిపర శ్రీను, వెంకట్ రెడ్డి,శ్రీను,ఆకుల బాలాజీ, వెంకయ్యనాయుడు, కాళీ, పట్టాభి, గల్లా వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎంఎం రాజు, బోయిన పోతురాజు, కాము, ఈశ్వరరావు, రాజు, రామలక్ష్మణ్, నారాయణరావు, కేశవ పాల్గొన్నారు.

పాలిక్యాబ్ గ్రీన్‌వైర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రముఖ ఎలక్ట్రికల్ గూడ్స్ కంపెనీ పాలీక్యాబ్ ఇండియా సంస్థ గ్రీన్ వైర్‌ను విడుదల చేసిందని, దీని ద్వారా భద్రత ఉంటుందని పాలీక్యాబ్ సంస్థ మార్కెటింగ్ ఆఫీసర్ నీలేష్ మలానీ తెలిపారు. నగరంలోని ఓ హక్షటల్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ ఉత్పత్తులను శు క్రవారం పరిచయం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేబుల్స్, వైర్స్ ల్యాండ్ స్కేప్‌ను మార్చడానికి ఈగ్రీన్ వైర్ తోడ్పడుతుందని తెలిపారు. దీని ద్వారా ప్రతి ఒక్కరి భద్రత, సంక్షేమం కోసం పాలీక్యాబ్ సంస్థ గ్రీన్ వైర్ వినియోగాన్ని ప్రచారం విస్తృతంగా చేస్తున్నామన్నారు. ముఖ్యంగా వినియోగదారులకు వైర్లు, కేబుల్స్ యొక్క విలువ ప్రతిపాదనల గురించి తెలియచేస్తున్నట్లు తెలిపారు. వైర్ల నాణ్యతతో పాటు ప్రజలు ఏవిధంగా జాగ్రత్తలు వహించాలో కూడా తెలియచేస్తున్నామని పేర్కొన్నారు. రానున్న కాలంలో మరినికన ఉత్పత్తులను తీసుకురానున్నట్లు తెలిపారు.

ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై భవానీ మండల దీక్షలు మహామండపం ఆరవ అంతస్తులో శుక్రవారం మొదలయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు, కార్యనిర్వహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ భవానీ దీక్షల్లో పాల్గొన్నారు. గురుభవానీ చేతుల మీదుగా భవానీలకు మాలాధారణ నిర్వహించారు. ఈ నెల 8న కార్తీక పూర్ణిమ రోజు శ్రీ భవానీ మండల దీక్షాధారణలు సమాప్తికానున్నాయి. అదే రోజు చంద్రగ్రహణం కారణంగా దీక్ష విరమణ కార్యక్రమం అనంతరం ఆలయాన్ని మూసివేయనున్నారు. గ్రహణం అనంతరం ఆలయాన్ని శుద్ధి చేసి సర్వదర్శనానికి యాత్రికులకు అనుమతిస్తారని ఆలయ ఇఒ తెలిపారు.



వాలీబాల్ విజేతలు కృష్ణా, ప్రకాశం

బాలికల విభాగంలో కృష్ణా, బాలుర విభాగంలో ప్రకాశం జట్లు విజయం


కృష్ణా జట్టు

ప్రజాశక్తి-బొబ్బిలి (విజయనగరం జిల్లా)

స్థానిక రాజా కళాశాల మైదానంలో హోరా హోరీగా సాగిన రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రకాశం, కృష్ణా జిల్లాల జట్లు విజయం సాధించాయి. మూడు రోజులుపాటు జరిగిన ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి 13 బాలికల జట్లు, 13 బాలుర జట్లు పాల్గొన్నాయి. శుక్రవారం రాత్రి జరిగిన ఫైనల్ పోటీల్లో బాలుర విభాగంలో ప్రకాశం జిల్లా, బాలికల విభాగంలో కృష్ణా జిల్లా క్రీడాకారులు విజయం సాధించారు. సెమీ ఫైనల్‌కు బాలుర విభాగంలో పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లా జట్లు చేరుకోగా, బాలికల విభాగంలో కృష్ణా, గుంటూరు జిల్లా జట్లు చేరుకున్నాయి. బాలికల విభాగంలో మొదటి స్థానంలో కృష్ణా, రెండో స్థానంలో గుంటూరు, మూడో స్థానంలో ప్రకాశం, నాలుగో స్థానంలో విశాఖపట్నం జట్లు నిలిచాయి. బాలుర విభాగంలో మొదటి స్థానంలో ప్రకాశం, రెండో స్థానంలో పశ్చిమగోదావరి, మూడో స్థానంలో శ్రీకాకుళం, నాలుగో స్థానంలో కృష్ణా జట్లు నిలిచాయి.

ఏకపక్షంగా కృష్ణా జట్టు విజయం

బాలికల విభాగంలో ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణా, గుంటూరు జిల్లాల మధ్య హోరాహోరీగా పోటీ జరిగింది. అయితే గుంటూరు జిల్లా జట్టుపై కృష్ణా జిల్లా జట్టు విజయం సాధించింది.

బాలుర విభాగంలో పశ్చిమగోదావరి, ప్రకాశం జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. రెండు జట్ల మధ్య హోరాహోరీగా సాగిన పోటీలో మొదటి సెట్లో పశ్చిమగోదావరి జిల్లా క్రీడాకారులు విజయం సాధించగా రెండు, మూడు, నాలుగు సెట్లలో వరుసగా మూడు సెట్లలో ప్రకాశం క్రీడాకారులు విజయం సాధించాయి. దీంతో ప్రకాశం జిల్లా జట్టును విన్నర్ గా ప్రకటించారు.

విజేతలకు, రన్నర్లకు, మూడో స్థానం, నాలుగో స్థానంలో నిలిచిన క్రీడాకారులకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన బహుమతులు అందజేశారు. క్రీడలను ప్రోత్సహించేందుకే బొబ్బిలిలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. విన్నర్లకు బేబినాయన అభిమాని రౌతు పార్థసారథి క్రీడా కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, వాలీబాల్ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


ప్రకాశం జట్టు



దుర్గమ్మను దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి

ప్రజాశక్తి-వన్‌టౌన్

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలోని దుర్గమ్మను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారి దర్శనం కల్పించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మైలవరం

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం మైలవరంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మైలవరం ఎస్టీ కాలనీకి చెందిన చిన కోటయ్య(55) మరికొంత మందితో కలసి రామకృష్ణా కాలనీలోని పలగాని శివనాగేశ్వరరావు ఇంటి స్థలంలో ఉన్న బావి ఒరలు తీసి పూడ్చే పనిని ఒప్పుకున్నారు. ఉదయం బావిలో దిగే క్రమంలో కాలుజారి 30 అడుగుల లోతులో ఉన్న బావిలో పడిపోయాడు. అగ్నిమాపక సిబ్బంది మూడు గంటలకు పైగా శ్రమించి కోటయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. ఎస్సై రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోబోటిక్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-మైలవరం

స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఏపీఎస్ఎస్‌డీసీ అప్లాయిడ్ రోబోటిక్ కంట్రోల్ ట్యాబ్‌జర్మనీ వారి సహకారంతో విద్యార్థులకు శుక్రవారం రోటోటిక్స్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యంతో కూడిన కోర్సులను అదనంగా నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధితి డాక్టర్ ఎస్పీ పిచ్చిరెడ్డి, డాక్టర్ జే శివవర ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. హరినాథ్‌రెడ్డి, డాక్టర్ వై విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'వేద' ఫ్యాషన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఎం.జీ.రోడ్డులోని అమరావతి పంక్షన్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం వేద ఫ్యాషన్స్ రెండవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు వేడుకలను ప్రారంభించి మాట్లాడుతూ వస్త్ర ప్రేమికులకు తక్కువ ధరలో నాణ్యమైన వస్త్రాలను వేద ఫ్యాషన్స్ నిర్వాహకులు అందుబాటులోకి తీసకువచ్చారని తెలిపారు. ఏడాది వస్త్ర ప్రేమికుల మది దోచేలా అన్ని రకాల దుస్తులు ఇక్కడ ఉన్నాయన్నారు. నమ్మకమైన, నాణ్యమైన వస్త్రాలకు చిరునామా వేద ఫ్యాషన్స్ అన్నారు. సంప్రదాయ వస్త్రాలతో పాటు యువత మెచ్చిన దుస్తులు అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. ప్రజాశీస్సులతో విజయవంతంగా దుకాణం నడుపుతున్న నిర్వాహకులను అభినందించారు. వేద ఫ్యాషన్స్ ఫౌండర్, చైర్మన్ కందుకూరి నాగరాజు మాట్లాడుతూ ప్రజలు పెట్టుకున్న నమ్మకమే తమ విజయానికి కారణమన్నారు. ఇది ఆడంబరం కాదని ప్రజలను గుర్తుంచుకుని సత్కరించుకునే ఉత్సవమని తెలిపారు. ఈ సందర్భంగా కొనుగోలుదారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరరావు, ప్రముఖులు డాక్టర్ తిరువీధి వేణుగోపాల్ పాల్గొన్నారు.

